సాక్షి
గుంటూరు
గురువారం । 21 । ఆగస్టు । 2025



సబ్ జైల్‌లో ఆకస్మిక తనిఖీ

గురజాల: స్థానిక సబ్‌జైల్‌ను డీఎస్పీ బి.జగదీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు.



పైడమ్మ తల్లి వార్షికోత్సవం

ముప్పాళ్ళ: స్థానిక శ్రీపైడమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

విఘ్నేశ్వరుడికి వైభవంగా పూజలు



సత్తెనపల్లి: గాంధీ చౌక్ విఘ్నేశ్వరుని ఆలయాన్ని బుధవారం పునఃప్రారంభించారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

ఉద్యోగిని నిరసన దీక్ష విరమణ



తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. పద్మావతి చేపట్టిన నిరసన దీక్షను బుధవారం విరమించారు. 10 రోజులుగా ఆమె దీక్ష చేస్తుండడంతో అఖిల భారత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు గుంటూరు నుంచి తెనాలికి వచ్చారు. దీక్షలో కూర్చున్న ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అధికారుల వద్దకు వెళ్లి ఆమెకు జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని, అదేవిధంగా ప్రైవేటు ఏజెన్సీని తొలగించాలని డిమాండ్ చేశారు. సరిపడా ఉద్యోగులు ఉన్న తెనాలిలో ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వారు అధికారులకు సూచించారు. అనంతరం పద్మావతి చేత దీక్ష విరమింపజేశారు.

డీఏ బకాయిల కోసం హైకోర్టుకు..

ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు శాంతిబాయి



మాచర్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన డీఏ బకాయిల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సాంబేలు శాంతిబాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది ఉద్యమ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏల కోసం అసోసియేషన్ తరఫున ఈ నెల 14న హైకోర్టులో పిటీషన్ వేసినట్లు ఆమె చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర దాటుతున్నా ఉద్యోగులకు అందించాల్సిన టీఏ, డీఏలను చెల్లించటంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హై కోర్టును ఆశ్రయించామని ఆమె తెలిపారు.


ఐటీఐ ప్రవేశాల దరఖాస్తుకు 26 వరకు గడువు

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీలోపు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 93914 02683లో సంప్రదించాలని సూచించారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థుల పత్రాల పరిశీలన

నగరంపాలెం(గుంటూరువెస్ట్):సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు ఈనెల 23న ధృవీకరణ పత్రాల పరిశీలన (సర్టిఫికెట్ వెరిఫికేషన్)కు హాజరు కావాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 23న గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) వద్దకు ఉదయం పది గంటలకు రావాలని అన్నారు. దరఖాస్తులతో జతపరిచిన అన్ని ఒరిజినల్ ధృవపత్రాలు, గెజిటెడ్ అధికారులతో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్‌లు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటో (కలర్)లతో రావాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

వ్యాపారిపై రౌడీషీటర్ దాడి



వేటపాలెం: రౌడీ షీటర్ దాడి చేసి రూ.4 లక్షలను లాక్కున్న ఘటన అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో బుధవారం చోటు చేసుకుంది. గాయపడిన బంగారు వ్యాపారి చీరాల ఏరియా వైద్యశాలలో చిక్కిత్స పొందుతూ, అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. అక్కాయపాలెం లక్ష్మీపురానికి చెందిన రౌడీషీటర్ మల్లెల రాజేష్ తన వద్ద పాత బంగారం ఉందని, తక్కువ ధరకు అమ్ముతామని తన సెల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఉంచాడు. విజయవాడకు చెందిన బంగారు వ్యాపారి రహమాన్ కోరడంతో లక్ష్మీపురం వెళ్లాడు. రౌడీషీటర్ ఇంటికి వెళ్లాక ఉన్న రూ.4 లక్షలను లాక్కున్నాడు.

అమరావతి... అదే దుస్థితి

రాజధాని ప్రాంతం మునగడంతో కూటమి ప్రభుత్వం విన్యాసాలు



అమృత వర్సిటీకి కూతవేటు దూరంలో కురుగల్లు గ్రామ శివారులో కొత్తగా నిర్మిస్తున్న ఎన్‌హెచ్-16 హైవే వద్ద రోడ్డుకు గండి కొట్టి వరదను పంపుతున్న దృశ్యం

అమరావతి ముంపులో లేదని.. దుష్ప్రచారం చేస్తున్నారని... పదే పదే చెబుతున్న కూటమి నేతలు మంగళవారం అర్ధరాత్రికి చేతులెత్తేశారు. హడావుడిగా పశ్చిమ బైపాస్ కింద గండ్లు ఎందుకు కొట్టించాల్సి వచ్చిందో వారే చెప్పాల్సి ఉంది. గత వారం కురిసిన వర్షాలకు కొండవీటి వాగుతోపాటు కొటేళ్లవాగు, పాలవాగు తదితరాలు పొంగడంతో రాజధానిలోని పలు గ్రామాలలో పొలాలు నీట మునిగాయి. మంత్రులు, పచ్చమీడియా చెబుతూ వచ్చిన మాటలన్నీ అబద్ధాలని మంత్రి నారాయణ తీరుతో తేలిపోయింది.

- అర్ధరాత్రి వేళ వెస్ట్ బైపాస్ దిగువన 20 పొక్లయిన్లతో గండ్లు
- పని పూర్తి అయ్యేవరకు అక్కడే ఉన్న మంత్రి నారాయణ
- అధికారుల ప్రణాళికా లోపంతోనే ముంపు సమస్య
- ఇప్పటికీ ఎస్ఆర్ఎం వర్సిటీ వెనుక సీడ్ యాక్సిస్ రోడ్డుపై మూడడుగుల మేర వరద
- వాస్తవాలు బయట పెడుతున్న 'సాక్షి'పై అక్కసు
- పోలీస్ స్టేషన్లలో అధికారులతో, పచ్చ నేతలతో అక్రమ ఫిర్యాదులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధాని ప్రాంతంలో పొన్నూరు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు ముంపు ప్రాంతాలకు వెళ్లి రైతుల తరఫున మాట్లాడుతుండటంతో ప్రభుత్వంలో అలజడి రేగింది. తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ సాక్షి మీడియాతోపాటు అంబటి మురళీకృష్ణపై ఇరిగేషన్ శాఖ అధికారులతో, పార్టీ నాయకులతోనూ తుళ్లూరు, తాడేపల్లి, చేబ్రోలు స్టేషన్లలో కేసులు పెట్టించారు.

పరిశీలన తర్వాత మంత్రి వ్యాఖ్యలిలా..

ఆరు రోజుల తర్వాత కూడా నీరు నిలిచి ఉండటంతో సీడ్ యాక్సిస్ రోడ్డు, అమృత యూనివర్సిటీ వద్ద మంత్రి నారాయణ మంగళవారం నీరుకొండ తదితర ప్రాంతాల్లో కొండవీటి వాగు ముంపు తీరును పరిశీలించారు. నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...?, గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా?, పశ్చిమ బైపాస్‌పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందన్నారు.

నీరు కదిలితే కదా..!

నిజమే. వర్షాలు పడిన తర్వాత వాగులు, వంకలు పొంగిపొర్లుతాయి. అయితే ఆ నీరు సక్రమమైన మార్గం గుండా వెళ్లి నదుల్లోనో, సముద్రాల్లోనో కలిస్తే సమస్య ఉండదు. ఆ సహజ ప్రవాహాలకు అడ్డుకట్టలు పడి ఎక్కడి నీరు అక్కడే ఉండిపోయి వేల ఎకరాలు నీటమునిగినప్పుడే సమస్య వస్తుంది. ఆ నీరు ఇంకిపోవడం తప్ప బయటకు పోలేని పరిస్థితి ఉన్నప్పుడే సమస్య పెద్దది అవుతుంది. ఈ విషయాన్ని పక్కన పెట్టి ఎంతసేపు సచివాలయం, ఏపీ హైకోర్టు ప్రాంగణాల్లో నీరు లేదని, రాజధాని మునగలేదని ఎల్లో మీడియా ప్రచారం చేస్తున్నాయి. రాజధాని అంటే 29 గ్రామాల పరిధిలో ఉందన్న విషయాన్ని అవి ఉద్దేశపూర్వకంగానే వదిలివేస్తున్నాయి. రాజధాని అంటే సచివాలయం, హైకోర్టు మాత్రమే అన్నట్లు చూపిస్తూ ప్రజలను మభ్యపెట్టే పనులు చేస్తుండటం గమనార్హం.

రాత్రికి రాత్రే పనులెందుకు?

మంగళవారం రాత్రి 20 పొక్లయిన్లను పెట్టి పనులు మొదలు పెట్టారు. పశ్చిమ బైపాస్ వద్ద రోడ్డుపై గండ్లు కొట్టి నీటికి కిందికి మళ్లించారు. అసలు వరదే లేదంటూ చెప్పిన వారు ఈ పనులు చేస్తుండటంతో వరద ప్రభావం ఎంత ఉందన్నది స్పష్టంగా అర్థం అవుతోంది. అమరావతి ముంపు ప్రాంతమని, రాజధాని అంత మంచిది కాదని గతంలోనే శివరామకృష్ణన్ కమిటీ, బోస్టన్ కమిటీ, జీఎన్ రావు తదితర నిపుణుల కమిటీలు నివేదిక ఇచ్చాయి. వాటన్నింటిని పక్కన పెట్టి మంత్రి నారాయణ నేతృత్వంలో కమిటీని వేసి, ఇక్కడే రాజధాని కట్టాలని ముందుకు వెళ్లిన సంగతి తెలిసిందే. వరద నివారణకు ప్రణాళిక లేకుండా సాగడం, రోడ్ల పేరుతో సహజ ప్రవాహానికి అడ్డంగా నిర్మాణాలు చేయడం, అవసరమైన చోట కాకుండా వేరే చోట్ల తూములు వేయడం వల్ల నీరు కిందికి వెళ్లే మార్గం లేక నిలిచిపోయింది.



కురుగల్లు గ్రామ శివారులో భారీగా వరద

కూటమి నేతలు పాడిందే 'పాట'

- కొల్లి శారద మార్కెట్ షాపులలో కూటమి నాయకుల పాగా



నెహ్రూనగర్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న నగరపాలక సంస్థకు చెందిన డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ దుకాణాల వేలం పాటలో కూటమి నేతలు సిండికేట్‌గా మారి దక్కించుకున్నారు. మార్కెట్‌లో ఉన్న 81 షాపులకు 18, 19, 20వ తేదీల్లో వేలం పాట నిర్వహించారు. పాత లీజుదారులు మంగళ, బుధవారాల్లో వారూ పాల్గొన్నారు. మంగళవారం 43వ నంబర్ షాపును రూ.1.06 లక్షలకు పాడుకున్నారు. బుధవారం 47వ నంబర్ షాపునకు ప్రభుత్వ అద్దె రూ.14,488 గా ఉండగా... దానిని ఒక్కసారే పాత లీజుదారుడు రూ.లక్షకు పెంచేశారు. అలా రూ.1,13,000కు షాపును దక్కించుకున్నారు. ఇదంతా చూస్తుంటే దుకాణాలపై ఎంత ఆదాయం వస్తుందో... అధికారులు ఇంతకాలం ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేశారో అర్థం కావడం లేదని నగరవాసులు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లోని 17ఏ నంబర్ షాపు ఎస్సీ వర్గీయులకు కేటాయించారు. పదుల సంఖ్యలో పోటీ పడ్డారు. కానీ ఎవరూ వేలంలో పాల్గొనకుండా కూటమికి చెందిన ఓ వ్యక్తి చక్రం తిప్పారు. పోటీదారులకు రూ.10 వేలు చొప్పున ఇచ్చినట్లు సమాచారం. దీంతో రూ.8 వేలకు మాత్రమే పాట పోయింది. అధికారులు రీ ఆక్షన్‌కు సిద్ధమైనట్లు సమాచారం. బుధవారం ఎస్సీ వర్గానికి కేటాయించిన 58వ నంబర్ షాపును ఎస్సీలను అడ్డుపెట్టుకుని కూటమి నాయకులు దక్కించుకున్నారు. 25 మంది వరకు బిడ్డింగ్‌లో పాల్గొన్నారు. వీరికి రూ.10 నుంచి రూ.25 వేల చొప్పున ఇచ్చి కేవలం రూ.21 వేలకు పాడుకున్నారు. మరోవైపు పాత లీజుదారులు కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 67వ షాపునకు అత్యధికంగా రూ. 5.50 లక్షలకు పాట పాడారు.



బయట పడేసిన బియ్యం బస్తాలు

నవ్యాంధ్రలో నయా దందా

- వ్యాపారులపై కిరాయి గూండాలతో దౌర్జన్యం
- షాపుల్లో ఉన్న వస్తువులు బయట పడేసి తాళాలు వేసిన రౌడీమూక
- కోర్టు పరిధిలో ఉందంటున్న వ్యాపారులు
- తరచుగా జరుగుతున్న సంఘటనలు
- నిద్రావస్థ వదలని పోలీసు అధికారులు



బూతులు తిడుతూ చెయ్యి చూపిస్తున్న రౌడీమూక

తాడేపల్లి రూరల్: నవ్యాంధ్ర రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో షాపుల అద్దె రేట్లు పెంచేందుకు కొంతమంది యజమానులు నయా దందా నిర్వహిస్తున్నారు. షాపులను ఖాళీ చేయించడానికి కిరాయి రౌడీలను తీసుకొచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. బుధవారం ఇదే తరహాలో విజయవాడకు చెందిన ఓ షాపు వద్దకు సుమారు 20 మంది రౌడీ మూకలను యజమాని తీసుకొచ్చాడు. దౌర్జన్యంగా షాపులో ఉన్న వారిని బయటకు పంపించి, గల్లాపెట్టెలో ఉన్న డబ్బులు తీసుకున్నాడు. షాపు లోపల ఉన్న సామగ్రినికి కూడా బయట పడవేసిన ఘటన చోటుచేసుకుంది. బాధితులైన వెంకటరావు, విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన బిట్రా వెంకట రమణమ్మ దగ్గర దాదాపు 20 సంవత్సరాల క్రితం వ్యాపారం నిర్వహించుకునేందుకు షాపు అద్దెకు తీసుకున్నామని చెప్పారు. ఈ ప్రాంతం రాజధాని అయిన తరువాత అద్దెలు ఎక్కువ ఇవ్వాలని వెంకట రమణమ్మ కుమారుడు హేమంత్ కోరగా తాము నిరాకరించినట్లు పేర్కొన్నారు.

కోర్టు తీర్పుతో..

అప్పట్లో అతను కోర్టును ఆశ్రయించగా, 90 రోజుల గడువు ఇచ్చింది. 20 రోజులు కాగానే కొంతమంది రౌడీ మూకలను హేమంత్ కుమార్ తీసుకువచ్చి షాపులో ఉన్నవారిపై దాడి చేశాడు. గల్లాపెట్టెలో ఉన్న డబ్బులు లాక్కున్నాడు. షాపులోని బియ్యం బస్తాలను బయటకు విసిరేశాడు. మరో షాపులో చెప్పులను పడేశాడు. ఇదేమని ప్రశ్నించిన వారిపై రాడ్లతో దాడి చేసి, దౌర్జన్యానికి పాల్పడ్డారు.

గతంలో కూడా ఉండవల్లి సెంటర్‌లో ఇదే తరహాలో ఏలూరు నుంచి ట్రాన్స్‌జెండర్లను తీసుకొచ్చి షాపులను ఖాళీ చేయించారు. నవ్యాంధ్ర రాజధానిలో ఇలాంటి దౌర్జన్యాలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్లే పునరావృతం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం పోలకంపాడులో ఓ వ్యక్తి ఇలాగే ప్రవర్తించాడు. అందరూ బంధువులు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కోర్టులో ఉండగా ఇలా దౌర్జన్యం చేయడం చాలా దుర్మార్గమని బాధితులు వాపోయారు. పోలీసులు ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్కడి నుంచో రౌడీలను తీసుకువచ్చి దౌర్జన్యానికి పాల్పడడం సరి కాదని, జరిగిన ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులు వచ్చినా లెక్కేలేదు...

స్థానిక పోలీసులకు యజమానులు సమాచారం అందించగా కానిస్టేబుల్ వచ్చారు. ఆయనపై దురుసుగా ప్రవర్తించి, అక్కడే ఉన్న బియ్యం కింద పారపోశారు. కానిస్టేబుల్ అరవడంతో ఆ బియ్యాన్ని మళ్లీ సంచిలోకి ఎత్తారు.



కింద పారబోసిన బియ్యం

'జీజీహెచ్'లో జీతం..
'ప్రైవేటు'లో వైద్యం!

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో సీనియర్ వైద్యుల తీరుతో రోగులకు తీవ్ర అవస్థలు

ఉమ్మడి ఏపీలో పేదల పెద్ద ఆసుపత్రిగా పేరొందిన గుంటూరు జీజీహెచ్‌లో రోగులు వైద్యుల కోసం ఎదురు చూపులు చూడాల్సి వస్తోంది. ముఖ్యంగా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల కోసం సుమారు ఏడు జిల్లాలకు చెందిన రోగులు రోజూ గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. ఎంతో వ్యయప్రయాసలతో చికిత్స కోసం వచ్చే పేద రోగులపై సీనియర్ వైద్యులు చిన్నచూపు చూస్తున్నారు. వారు జీజీహెచ్‌లో జీతాలు తీసుకుంటూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు చేస్తున్నారు. రోగులకు జూనియర్ వైద్యులే పెద్ద దిక్కుగా మారుతున్నారు.



ఓపీ విభాగం వద్ద రోగులు

- ప్రభుత్వాసుపత్రిలో అటకెక్కిన వైద్యుల సమయపాలన
- సీనియర్ వైద్యుల సేవల కోసం రోగుల ఎదురుచూపులు
- జూనియర్లే అన్నీ చూస్తున్నా పట్టించుకోని అధికారులు
- మొక్కుబడి తనిఖీలతో గాడి తప్పిన ఆస్పత్రి నిర్వహణ
- 'స్పందన'లోనూ ఈ అంశాలపైనే బాధితుల ఫిర్యాదు

గుంటూరు మెడికల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుంటూరు జీజీహెచ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. అవుట్ పేషెంట్ విభాగం (ఓపీ) రోగులకు సేవలు అందించాల్సి ఉంటుంది. వైద్యులకు బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ సమయపాలన పాటించడం లేదు. సీసీ కెమెరాలు ఉన్నా వైద్యులు ఆసుపత్రికి వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసి గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు ఆసుపత్రులకు, సొంత క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. జీజీహెచ్‌లో ఉండాల్సిన సమయంలో 'ప్రైవేటు' వైద్య సేవల్లో తరిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ సేవలు అందించి, గంట సేపు భోజన విరామం తీసుకున్న తరువాత మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వార్డుల్లో బెడ్‌సైడ్ టీచింగ్ చేస్తూ రోగులను చూడాల్సి ఉంటుంది. కానీ కొంత మంది సీనియర్ వైద్యులు



గుంటూరు జీజీహెచ్

ఓపీలోనే జూనియర్ వైద్యులకు పాఠాలు చెబుతూ రోగులను వేచి ఉండేలా చేస్తున్నారు. మరికొంత మంది విభాగాధిపతులు ఓపీలకు రాకుండా వార్డుల్లో ఉంటూ సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. నిబంధనల ప్రకారం విభాగాధిపతులు కూడా ఓపీలకు హాజరై రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. సీనియర్ వైద్యులు, విభాగాధిపతులు ఓపీలకు హాజరు కాకపోవడంతో జూనియర్లు తమకు తోచిన వైద్యం చేస్తూ నెట్టుకొస్తున్నారు. దీని వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలు అందక రోగులు పలుమార్లు ఆసుపత్రికి రావాల్సి వస్తోంది.

తనిఖీలు శూన్యం

ఆసుపత్రిలో ఓపీ పనివేళల్లో సీనియర్ వైద్యులు విధుల్లో ఉన్నారా? లేదా? రోగులు వైద్య సేవలు పొందేందుకు ఏమైనా ఆటంకాలు ఎదురవుతున్నాయా? అనే విషయాలు పరిశీలించేందుకు రోజూ జీజీహెచ్ అధికారులు, వైద్య కళాశాల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తొమాలజీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, పీడియాట్రిక్స్, రేడియాలజీ వంటి స్పెషాలిటీ వైద్య సేవలతోపాటు కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, క్యాన్సర్ వంటి సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవల కోసం రోజూ 3 వేల నుంచి 4 వేల మంది రోగులు జీజీహెచ్‌కు వస్తున్నారు. రోగులు పెద్ద ఆసుపత్రిపై ఎంతో నమ్మకంతో వస్తుంటే, సీనియర్ వైద్యులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. వైద్యులు నిర్ణీత పనివేళలు పాటించేలా పర్యవేక్షణ చేయాల్సిన ఆసుపత్రి, వైద్య కళాశాల అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలతో కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోగుల వేదన వెల్లడి

జీజీహెచ్‌కు సుదూర ప్రాంతాల నుంచి చికిత్సకు వస్తున్నామని, పెద్ద సార్లు అందుబాటులో ఉండకపోవడం వల్ల పలుమార్లు రావాల్సి వస్తోందంటూ పలువురు బాధిత రోగులు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సులో లిఖితపూర్వకంగా తెలియజేశారు. వైద్యుల పనితీరును పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎందుకు మిన్నకుండిపోతున్నారో అర్థంకాక రోగులు తలలు పట్టుకుంటున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ జీజీహెచ్ వైద్యుల సమయపాలనపై దృష్టి సారించాల్సి ఉంది. నిర్ణీత పనివేళల్లో వారు అందుబాటులో ఉండి రోగులకు సత్వర సేవలు అందేలా చూడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

గుండెపోటుతో తుళ్ళూరు ట్రాఫిక్ ఏఎస్ఐ మృతి



తాడికొండ: గుండెపోటుతో ట్రాఫిక్ ఏఎస్ఐ మృతి చెందిన ఘటన తుళ్ళూరులో జరిగింది. తుళ్ళూరు ట్రాఫిక్ ఏఎస్ఐగా పనిచేస్తున్న రవీంద్ర (55) విధులు ముగించుకొని కారు నడపుతూ వెళుతుండగా తుళ్ళూరు శివారు సాయిబాబా ఆలయం వద్దకు రాగానే గుండెపోటుకు గురయ్యారు. కారును రోడ్డు పైనే నిలిపి పక్కకు పడిపోయారు. ఉన్నట్టుండి కారు నిలిచిపోవడంతో సమీపంలో ఉన్న ఏపీఎస్పీ సిబ్బంది కారు అద్దాలు పగలగొట్టి రవీంద్రను బయటకు తీసి తుళ్ళూరు పీహెచ్‌సీకి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి తుళ్ళూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో పారాణి ఆరకముందే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లికి చెందిన రంగనాయకమ్మ (24)కు ఈ నెల 17వ తేదీన ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉంటున్న జితేంద్రతో వివాహం చేశారు. బుధవారం జితేంద్ర తన భార్య ఉన్న గదిలో నుంచి బయటకు వచ్చాడు. పది నిమిషాల అనంతరం తిరిగి లోనికి వెళ్లేందుకు రాగా గదికి గడియ పెట్టి ఉంది. ఎన్నిసార్లు తలుపులు కొట్టినా తీయకపోవడంతో అత్తకు చెప్పాడు. ఆమె పిలిచినా రంగనాయకమ్మ స్పందించలేదు. పక్కింటి వారి సహాయంతో జితేంద్ర తలుపులు పగలగొట్టగా.. రేకుల గదిలోని ఇనుప రాడ్‌కు చున్నీతో రంగనాయకమ్మ ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏడాదిగా రంగనాయకమ్మకు కడుపునొప్పి ఉండడం వల్లే వివాహానికి నిరాకరించిందని, దానివల్లే ఆత్మహత్య చేసుకుందని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

డీ ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాలపరిమితి గల డీఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జాస్తి ఉషారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ రెగ్యులర్, దూరవిద్య ద్వారా బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థినులతో పాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు నుంచి తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు అడ్మిషన్ ఫీజులో మినహాయింపుతోపాటు ఉపకారవేతనాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, దరఖాస్తు రుసుము రూ.400తో కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 92471 20305, 98480 38769 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంధత్వాన్ని జయించడం అద్భుతం

– రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్



అంధుల క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో జయించి క్రికెటర్లుగా రాణిస్తున్న యువత ప్రతిభ అద్భుతమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ అభినందించారు. బుధవారం స్థానిక అరండల్‌పేటలోని ఏసీఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఏపీ, విజువల్లీ బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, డిఫరెంట్ డిసేబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధుల క్రికెట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధులు సమాజంలో ఎవరికీ తాము తక్కువ కాదని నిరూపిస్తున్నారన్నారు. వీరిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మాజీ బ్లైండ్ క్రికెటర్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన 42 క్రికెటర్లతో మూడు జట్లుగా మూడు రోజులపాటు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరి నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ బ్లైండ్ క్రికెట్ జట్టు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం జస్టిస్ కృష్ణమోహన్‌ను అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్ డైరెక్టర్ పి.ప్రకాష్ రెడ్డి, ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, వీసీఏ అధ్యక్షుడు రవీంద్ర బాబు, అంధుల క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు అందలమా 'ఆచార్యా'?

- ఏఎన్‌యూలో ఆచార్యుల పోస్టులను అర్హత లేని వారికి కట్టబెట్టే ప్రయత్నం
- కొత్త వీసీ వచ్చేలోగా నియామకాలకు ఆదేశాలు
- నోటిఫికేషన్ లేకుండానే మరో పోస్టు భర్తీకి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మరోసారి అడ్డగోలు నియామకాలకు వేదికగా మారింది. పూర్తి స్థాయి వీసీ నియామకం ఈ నెలాఖరులోగా జరుగుతుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో అర్హత లేని వారికి, తమ వారికి పోస్టులు కట్టబెట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఫార్మసూటికల్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఆచార్యుని నియామకం కోసం జూన్ నెలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. జూలై 19న ఇంటర్వ్యూలు నిర్వహించారు. సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీతోపాటు 15 సంవత్సరాలు బోధన అనుభవంలో కనీసం ఐదేళ్లు ప్రొఫెసర్ లేదా సీనియర్ ప్రొఫెసర్‌గా అనుభవం ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం విద్యార్హతలతోపాటు కనీసం ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులను గైడ్ చేసిన అనుభవం కూడా ఉండాలి.

వీసీ వర్గం కావడంతో....

అర్హులను కాదని ఐదేళ్ల ప్రొఫెసర్ అనుభవం కూడా లేని, పీహెచ్‌డీ విద్యార్థిని గైడ్ చేయని మహిళకు ఆ పోస్టు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ సామాజిక వర్గానికే చెందడమే ఆమె అర్హతగా చెబుతున్నారు. ఇన్‌చార్జి వీసీ కావాలనే ఇలా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రా వర్సిటీలో ప్రిన్సిపల్‌ను కాదని, పలుచోట్ల అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లను కాదని, తన వర్గానికే చెందిన ఆంధ్రా వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్‌ను సెలక్షన్ కమిటీ సభ్యునిగా నియమించారు. అక్కడే ఉండే మరో ప్రొఫెసర్‌కూ కమిటీలో చోటు కల్పించారు. అందరూ కలసి అర్హత లేని ఒక ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలికి ఈ పదవి కట్టబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చి రెండు పోస్టులకు భర్తీ చేయడం ఇంకో వింత. రెండవ పోస్టుకు కూడా సింగరాయకొండలోని మూతపడే స్థితిలోని ప్రైవేట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌ను నియమిస్తున్నట్లు చెబుతున్నారు. ఆయకూ అర్హతలు లేవని సమాచారం. ఈ పోస్టులు నోటిఫై చేయకముందుగానీ, ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాగానీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో ఆమోదం పొందలేదు.

బాలిక హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

గుంటూరు లీగల్ /చేబ్రోలు: మైనర్ కిడ్నాప్, హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1,100 జరిమానా విధిస్తూ గుంటూరు నాలుగవ అదనపు జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి శరత్ బాబు బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... గతేడాది జూలై 15వ తేదీన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసి, హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన నరమామిడి నాగరాజు కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలులో నివాసం ఉండేవాడు. బాలి తల్లి ఎస్తేరు రాణితో నాగరాజు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ సంబంధం బెడిసికొట్టిన తర్వాత ప్రతీకారంతో బాలికను తన ఇంటికి తీసుకువెళ్లి గొంతు నులిమి, హత్య చేశాడు. మృతురాలి తండ్రి పేరుపోగు దావీదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును తెనాలి ఎస్‌డీపీఓ బి.జనార్దనరావు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. న్యాయస్థానంలో నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణతో కేవలం ఏడాదిలోనే న్యాయస్థానంలో నిందితుడికి కఠిన యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ మేరకు బుధవారం నాలుగవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శరత్‌బాబు తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ, సీసీఎస్ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పోస్టల్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాల్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జాఫర్ సాధిక్ తెలిపారు. తపాలా శాఖ నిర్వహించే ఫిలాటెలి క్విజ్ మరియు ఫిలాటెలి ప్రాజెక్టుల ఆధారంగా ఏడాదికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ పొందవచ్చన్నారు. విద్యార్థి 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలలో చదువుతూ, సంబంధిత పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్ సభ్యుడై ఉండాలన్నారు. పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్ లేకపోతే అభ్యర్థి తన సొంత ఫిలాటెలి అకౌంట్ కలిగి ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలన్నారు.

గీత కులాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల


నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో గీత కులాలకు కేటాయించిన బార్లకు గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు బుధవారం విడుదల చేశారు. జిల్లా పరిధిలోని గుంటూరు నగరపాలక సంస్థలో గౌడకు 4, గౌడ్ 2, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లో గౌడకు 2, తెనాలి మున్సిపాలిటీ పరిధిలో గౌడకు, గౌడ్‌కు ఒకటి చొప్పున బార్‌లు కేటాయించడం జరిగిందన్నారు. ఆయా వర్గాలకు కేటాయించిన షాపుల్లో వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ దరఖాస్తులు స్వీకరిస్తామని 30న లాటరీ ద్వారా కేటాయింపు ఉంటుందన్నారు.

రైతులు పొగాకు సాగు చేయొద్దు

– జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో పొగాకు పంటను రైతులు ఎవరూ సాగుచేయెద్దని, నారుమళ్లు వేయరాదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 2024–25లో 3124మంది రైతులు 10,954 ఎకరాల్లో బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగుచేశారని, దీని వలన 1,21,010 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. అధిక దిగుబడితో పొగాకు వ్యాపారులు రైతుల నుంచి పూర్తి స్థాయిలో కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేపట్టిందన్నారు. అందువలన ఈ ఏడాది రైతులు ఎవరూ కంపెనీ వ్యక్తుల నుంచి బాండ్లు తీసుకోరాదని, పొగాకు నారుమళ్లు వేయరాదని కోరారు. పొగాకుకు బదులుగా అధిక దిగుబడిని ఇచ్చే పంటలను సాగుచేయాలని కోరారు. మధ్యవర్తులు ఎవరైనా సాగుకు ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతేడాది పండిన పొగాకు నిల్వలను కొనుగోలుచేయకుండా ఈ ఏడాది సాగుచేయాలని ప్రోత్సహించటం క్షమించరాని నేరమన్నారు. రైతులు కంపెనీ వారి మాటలు వినిమోసపోవద్దని సూచించారు. పూర్తి బాధ్యతను గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వెల్దుర్తి: స్కూల్ బస్సు.. ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘటన మండలంలోని మండాది గ్రామ సమీపంలోని కానాగు వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. మండలంలోని రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్వర్లు (28) రచ్చమల్లపాడు నుంచి మాచర్లకు వస్తుండగా.. మాచర్ల పట్టణానికి చెందిన సెయింటాన్స్ స్కూల్ బస్సు విద్యార్థులను మండాది గ్రామంలో వదిలిపెట్టేందుకు వస్తోంది.. ఈక్రమంలో నేషనల్ హైవే 565 కానాగు బ్రిడ్జి మీద స్కూల్ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల వెంకటేశ్వర్లు 25 అడుగుల లోతు గల కానాగులో ఎగిరి పడ్డాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



పంటను పరిశీలిస్తున్న ఏడీఏలు సునీత, రామకోటేశ్వరి

పొన్నూరు: సాగులో రసాయన ఎరువులను తగ్గించాలని గుంటూరు బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్ ఏడీఏ సునీత రైతులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్డిముక్కల, ఆలూరు గ్రామాల్లో స్థానిక ఏడీఏ రామకోటేశ్వరితో కలిసి ఆమె పంట పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జీవన ఎరువులైన పాస్ఫరస్ సాల్యుబ్ లైజింగ్ బ్యాక్టీరియాను (పీఎస్‌బీ)వినియోగించడం వలన పొలంలో భాస్వరాన్ని కరిగించి పంటకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీని వలన ఎరువుల వినియోగం తగ్గించవచ్చని అన్నారు. ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నగదు జమ కానివారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి. ప్రసాదు, ఎంపీఈఓ ఎస్. సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్ రీచ్ క్యాంపు



అవగాహన కార్యక్రమంలో ఇ.వెంకటేశ్వరరావు, బి.కె.ప్రసాద్ తదితరులు

కొరిటెపాడు: జిల్లాలో వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్ రీచ్ క్యాంప్ 'లక్ష్య', ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సాచురేషన్ క్యాంపు (జనన సురక్ష క్యాంప్)ను నగరంపాలెంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. క్యాంపును కడప రీజియన్ రీజినల్ హెడ్ ఇ. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. లక్ష్య, ఫైనాన్షియల్ ఇంక్లూజ్ సాచురేషన్ క్యాంపునకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. క్రెడిట్ క్యాంపెయిన్ సమయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, సీకేసీసీ రుణగ్రహీతలకు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. కండ్లకుంట బ్రాంచ్ హెడ్ అశోక్‌కుమార్, సిబ్బందితోపాటు ఏపీఎం, ఇతర సీసీఏలు ఈ క్యాంపులో పాల్గొన్నారని చీఫ్ మేనేజర్ బి.కె.ప్రసాద్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీసు ఉన్నవారు అవార్డులకు అర్హులని చెప్పారు. నేరారోపణలు, అభియోగాలు ఉన్న వారు అనర్హులని తెలిపారు. తనిఖీ అధికారుల ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. రెండు సెట్లను ఎంఈవో, డీవైఈవో, ఉర్దూ రేంజ్ ఉప తనిఖీ అధికారుల కార్యాలయాల్లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని పేర్కొన్నారు. నమూనా దరఖాస్తును డీఈవోగుంటూరుబ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు తెలిపారు.

డాక్టర్ విశ్వేశ్వరరావుకు బంగారు పతకం



డాక్టర్ విశ్వేశ్వరరావుకు బంగారు పతకాన్ని బహూకరిస్తున్న దృశ్యం

తెనాలిరూరల్: పట్టణ బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు దివంగత డాక్టర్ కొత్త రవీంద్రబాబు స్మారక ధార్మిక బంగారు పతకాన్ని గుంటూరుకు చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావుకు బహూకరించారు. ఈ సందర్భంగా 'కామన్ యూరలాజికల్ ప్రాబ్లమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ గైడ్‌లైన్స్'పై డాక్టర్ విశ్వేశ్వరరావు ప్రసంగించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ మధుప్రభాకర్‌బాబు, డాక్టర్ కె. శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ పావనిప్రియాంక, డాక్టర్ కొత్త రవీంద్రబాబు కుటుంబసభ్యులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ బాలికల జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో హెచ్ఎం విజయ, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ సామంతరెడ్డి, శ్రీనివాసరావు, జనార్దన్ రెడ్డి యాదవ్, పీడీలు

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ విభాగంలో జిల్లాస్థాయి బాలికల జట్టు ఎంపికలు సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో 15 మందిని జట్టుకు, మరో ఐదుగురిని స్టాండ్‌బైకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో పల్లపాడుకు చెందిన సిహెచ్ అనిత, జి.సునందిని, ఎం.శృతి, సిహెచ్ పావని, బి.నందిని, కె.తేజస్విని, కె.చందన, ఇ.చంద్రిక, వి.లిద్య/ఎం.తిరుపతమ్మ, రొంపిచర్లకు చెందిన వి.శ్రీదేవి, పీవీఎస్ చంద్రిక, కొమెరపూడికి చెందిన బి.ప్రసన్న జ్యోతి, వినుకొండకు చెందిన ఆర్.రాగసుధ, క్రోసూరుకు చెందిన కె.దీవెన ఏంజిల్, కేఎల్ఎస్ ప్రవల్లికలు ఉన్నారు. స్టాండ్ బైలుగా బి.శ్రీలక్ష్మి (రొంపిచర్ల), కె.సంజన (బ్రాహ్మణ కోడూరు), పి.శైలజ, జె.ధనలక్ష్మి, కె.తన్మయిసాయి (రామకృష్ణాపురం)లు ఎంపికయ్యారు. ఎంపికైన బాలికలు ఈనెల 30, 31 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ జిల్లా సెక్రెటరీ పి.సామంతరెడ్డి, జాయింట్ సెక్రెటరీ నర్రా శ్రీనివాసరావు, ట్రెజరర్ జనార్దన్ రెడ్డి యాదవ్‌లు పాల్గొన్నారు. ఎంపికలకు సెలక్షన్ కమిటీ మెంబర్లుగా పీడీలు సైదయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బారావులు వ్యవహరించారు. ఎంపికైన బాలికలకు గురువారం నుంచి కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని పాఠశాల హెచ్ఎం బి.విజయ తెలిపారు.

• యూరియా కష్టాలు!



కూటమి ప్రభుత్వం యూరియా కోసం అన్నదాతలను రోడ్డెక్కించింది. పెదకాకాని మండలంలోని గోళ్ళమూడి గ్రామం ఉప్పలపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం పీఎసీఎస్ పరిధిలో ఉంది. వాస్తవానికి యూరియా అమ్మకాలు సొసైటీ వద్ద గానీ సమీపంలోని రైతు భరోసా కేంద్రం వద్ద గాని చేపట్టాలి. బుధవారం గోళ్ళమూడి గ్రామంలో లారీ రోడ్డుపై పెట్టి అమ్మకాలు చేపట్టారు. ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకు వచ్చిన వారికి ఒక్కొక్కరికి 5 బస్తాల చొప్పున అమ్మకాలు చేశారు. 5 బస్తాలు యూరియా 1350 రూపాయల చొప్పున అమ్మకాలు జరిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత వచ్చిందని కూటమి ప్రభుత్వంలో రోడ్డుపై లైన్లలో నిలబడి యూరియా కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. లారీ లోడ్ యూరియా సొసైటీల ద్వారా అమ్మకాలు చేపట్టాలంటే 40 లీటర్లు నానో (యూరియా లిక్విడ్) కూడా అమ్మకాలు చేపట్టాలని మార్క్‌ఫెడ్ అధికారులు ఒత్తిడి చేస్తూ యూరియా కొరత సృష్టిస్తున్నారని పలువురు అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

– పెదకాకాని

వాణిజ్యం – నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 3,000 గరిష్టం : రూ. 3,600

మోడల్ ధర రూ. 4,000

మిర్చి యార్డు సమాచారం (బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	51,349
అమ్మకాలు	48,853
నిల్వ	11,212

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,500
నంబరు-5	10,000–13,300
341	10,000–14,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,400
నంబరు-5	10,000–13,500
341	11,000–15,000
4884	10,000–12,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ-355	10,000 – 13,500
దేవనూరు డీలక్స్	10,000 – 13,300
ఆర్మూర్	9,800 – 11,500
తాలుకాయలు	6,000 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,400
బాడిగ – 355	10,000–13,000
దేవనూరు డీలక్స్	10,500–13,500
తాలు	5,300 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)